## బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం..



జేజే నగర్‌లోని బీఆర్‌ఎస్ నాయకుడు జగన్‌గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి

నేరేడ్‌మెట్, అక్టోబర్ 13: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్ డివిజన్ జేజేనగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు జగన్‌గౌడ్ మొదటి వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి జగన్‌గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జగన్‌గౌడ్ కుమారుడు సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సాయన్న ఆశయ సాధనకు కృషి చేస్తాం : బీఆర్‌ఎస్



కంటోన్మెంట్, అక్టోబర్ 13: దివంగత ఎమ్మెల్యే సాయన్నకు బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు శ్రద్ధాంజలి ఘటించారు. శుక్రవరాం కార్ఖానాలోని సాయన్న నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయన్న ఆశయ సాధన కోసం పాటుపడతామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో ప్రజల ముందుకు వస్తున్న కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. లాస్యనందిత ప్రజలతో మమేకం అవుతున్నందున గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత, పార్టీ నాయకురాలు నివేదితతో పాటు మార్కెట్ ఇన్‌చార్జి చైర్మన్ చింతల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, నేతలు సదానంద్‌గౌడ్, మురళీయాదవ్, పనస సంతోష్, ధన్‌రాజ్, నాగరాజు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపే ధ్యేయం

కంటోన్మెంట్, అక్టోబర్ 13: ఎన్నికల నగారా మోగగానే కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ దూకుడు పెంచింది. దీంతో పాటు కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జిగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పార్టీ అధిష్టానం నియమించడంతో కార్య రంగంలోకి దూకనున్నారు. ఈ క్రమంలో నేడు కార్ఖానాలోని బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు సన్నాహక సమావేశం సహా కంటోన్మెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో కీలక సమన్వయ సమావేశం జరుగనున్నది. రాష్ట్ర మంత్రి తలసాని ఆధ్వర్యంలో జరగనున్న ఈ భేటీకి ముఖ్య నేతలందరూ హాజరుకానున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత గెలుపు ఖాయమైనా..మెజార్టీ లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ మేరకు ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు నేడు ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

## మంత్రిని కలిసిన ఆలయ ఈఓ

మారేడ్‌పల్లి, అక్టోబర్ 13: వెస్ట్‌మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఈఓగా పదవీ బాధ్యలు చేపట్టిన అరుణ కుమార్ శుక్రవారం మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆలయ చైర్మన్ సి. సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అదేవిధంగా ఆలయంలో జరిగే దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ ఈఓ అరుణకుమారి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగేందర్ యాదవ్, చొల్లేటి రమేశ్, నర్సింగ్‌రావు, వేణుగోపాలచారి, పద్మజా, భాస్కర్, ఆలయ ప్రధాన అర్చకులు టి. రాజేశ్వర శర్మ, తదితరులు ఉన్నారు.

# రైల్వే చక్రబంధం నుంచి విముక్తి కల్పిస్తాం..

• బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి



బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి/నేరేడ్‌మెట్, అక్టోబర్ 13: రైల్వే చక్రబంధం నుంచి మల్కాజిగిరికి విముక్తి కల్పిస్తామని బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లో మర్రి రాజశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం తథ్యమన్నారు. మల్కాజిగిరి సర్కిల్ ప్రజలకు రైల్వే గేట్లు రోజూ నరకం చూపిస్తున్నాయని, త్వరలోనే వాటినుంచి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వాజ్‌పేయినగర్, గౌతంనగర్, వినాయక్‌నగర్, బొల్లారం వద్ద రోజూ పదుల సంఖ్యలో రైళ్ల రాకపోకల సాగించడంతో తరచూ గేట్లు మూసివేస్తున్నారని, తద్వారా వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలోనే ఆయా రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిలను కేంద్ర ప్రభుత్వంచే మంజూరు చేయించి నిర్మిస్తామని చెప్పారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 278లో నివసిస్తున్న 80వేల మంది భూసమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అల్వాల్ సర్కిల్‌లో సివరేజ్ రిట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామని అన్నారు. గౌతంనగర్‌తో పాటు ఇతర డివిజన్లలోని అర్బన్ ల్యాండ్(యూఎల్‌సీ) సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. వక్ఫ్ భూములు, ఎండోమెంట్ భూముల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

### సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష

ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష అని ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకే ఉందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా అనేక అభివృద్ధి పనులు చేపట్టారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను అమలు పరిచి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో కులమతాలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసి ఓటు అభ్యర్థించాలని నాయకులకు సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు కలిసి కట్టుగా పనిచేస్తే విజయం మనదేనని పేర్కొన్నారు. మరోసారి డివిజన్ స్థాయి నాయకులతో సమవేశం నిర్వహిస్తామని తెలిపారు.

# ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసు ప్రారంభం



ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసును ప్రారంభించిన ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు

మల్కాజిగిరి, అక్టోబర్ 13: మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ఖాయమని కంటోన్మెంట్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మల్కాజిగిరి డివిజన్ ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలుపరుస్తున్నారని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నెలనెలా పింఛన్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. బస్తీ దవఖానల ద్వారా పేదలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదువులు చెబుతున్నారని, విద్యార్థులకు ఉచితంగా టెక్స్‌బుక్స్, నోట్‌బుక్స్, యూనిఫాంలు, ఉదయం సీఎం అల్పాహారం, మధ్యాహ్నం పోషకాహారాలతో కూడిన భోజనం అందజేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు



కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు



వాజ్‌పేయినగర్‌లో బతుకమ్మలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు

గౌతంనగర్/ నేరేడ్‌మెట్, అక్టోబర్ 13 : పూలను పూజించే సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికే చెందుతుందని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలోని సెయింట్ ఆన్స్ జూనియర్, డిగ్రీ బాలికల కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ వేడుకలను ప్రపంచానికి చాటిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్సీ కవితకే దక్కుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నేరేడ్‌మెట్ పరిధిలో..**

వాజ్‌పేయినగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు, నేరేడ్‌మెట్ డివిజన్ జేజెనగర్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శుక్రవారం చిన్నారులు, బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శైలజ, డాక్టర్ ఏ. రచన మల్లిక, అహల్య, రుకియా, భాను, స్వప్న, సెయింట్ జాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ రేబకమన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మితే మోసపోతాం..

కంటోన్మెంట్, అక్టోబర్ 13: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధితో అందరి చూపు బీఆర్‌ఎస్ వైపే ఉందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఆయన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిదేండ్లలోనే బీఆర్‌ఎస్ సర్కారు ఊహించని అభివృద్ధి చేసిందని, ప్రజలు మరోసారి ఆశీర్వదించి మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. కొందరు స్వార్థ రాజకీయాల కోసం ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు నమ్మితే మళ్లీ అభివృద్ధి వెనక్కి వెళ్లిపోతుందన్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందిత గెలుపు తథ్యమని వెల్లడించారు.